## క్లుప్తంగా

### 'స్కిల్ డెవలప్‌మెంట్' సెంటర్ పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

**మంచిర్యాలటౌన్:** పట్టణంలో రూ.8కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రం పనులను సోమవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కౌన్సిలర్ సురేశ్ బల్దువా, ప్రకాశ్‌నాయక్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పల్లపు తిరుపతి, నాయకులు కొండల్‌రావు, చంద్రమౌళి, తిరుపతి, జయరామారావు పాల్గొన్నారు.

### నోటీస్ బోర్డ్‌పై ఆరో తరగతి పరీక్ష ఫలితాలు

**మందమర్రిరూరల్:** మండల కేంద్రంలో మోడల్ స్కూల్లో 2023–24 విద్యా సంవత్సరం ఆరో తరగతిలో సీటు కోసం ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాలు సోమవారం ప్రకటించగా స్కూల్ నోటీస్ బోర్డుపై మార్కులు, ర్యాంకుల జాబితా అంటించినట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 516 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 454మంది విద్యార్థులు పరీక్ష రాసారని తెలిపారు. పాఠశాలలోని సీట్ల మేరకు మెరిట్, స్థానికత రిజర్వేషన్ ప్రకారం 100 మంది విద్యార్థుల పేర్లు ఎంపిక చేసి, కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తామని అనంతరం అడ్మిషన్ ప్రక్రియ ఉంటుందని దళారులను నమ్మి మోసపోవద్దని విద్యార్థులు, పేరెంట్స్ గమనించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

### ఆర్కే 5బి ఫిట్ కమిటీ ఎన్నిక

**శ్రీరాంపూర్:** సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (1630/1982)ఆర్కే 5బి గని ఫిట్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. ఫిట్ సెక్రెటరీ చెన్నూరి రమేశ్, అసిస్టెంట్ ఫిట్ సెక్రెటరీగా టీ.సురేశ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా దాసరి హరికృష్ణ, రిలే ఇన్‌చార్జీలుగా మాతంగి రాజేశ్, చిట్యాల మహేశ్, నీరడి శ్రావణ్‌కుమార్, కోటగిరి వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు నెలబోయిన కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ చెన్నూరి శ్రీనివాస్, నాయకులు సురేశ్, క్రాంతికుమార్, దాసరి సంపత్ పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత

**మంచిర్యాలఅర్బన్:** నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపడుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్వామి, యూఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు భీమేష్ సోమవారం మంచిర్యాల డీఈవో యాదయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఇంటర్నేషనల్, సీబీఎస్‌ఈ పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని దృష్టికి తీసుకొచ్చారు.

### దేవాపూర్ ఎస్సైగా ఆంజనేయులు



**కాసిపేట:** మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా సోమవారం ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన విజయేందర్ బదిలీపై సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, ఆయన స్థానంలో బెల్లంపల్లి 2–టౌన్ ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న ఆంజనేయులు బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.

### కార్మికులకు ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

**లక్సెట్టిపేట:** మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలోని కార్మికుల కోసం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వేసవి కాలం కావడంతో కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ జిల్లా మేనేజర్ రాజు, సర్పంచ్ సునీత, నాయకులు రవి, శేఖర్, సత్తయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# భూమి కోసం పోరుబాట!

- అసైన్డ్‌భూముల కబ్జాకు పాల్పడుతున్న రియల్టర్లు
- ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం డిమాండ్
- 15రోజులుగా కొనసాగుతున్న పోరాటం
- పట్టించుకోని అధికారులు



బావురావుపేట శివారులో సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం

**చెన్నూర్:** నియోజకవర్గ కేంద్రంలో వందలాది ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూములను కబ్జాదారులు అక్రమ వెంచర్లుగా ఏర్పాటు చేసి సొమ్ము చేసుకుంటున్నారని సీపీఎం ఆధ్వర్యంలో భూ పోరాటానికి సిద్ధమయ్యారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ, చెన్నూర్ మండలంలోని బావురావుపేట శివారులో గల సర్వే నెంబర్ 8లో ఉన్న 27ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని గత పక్షం రోజులుగా పేదలతో కలిసి ఆ భూముల్లోనే పోరాటం చేస్తున్నారు. మండుటెండలో పేదల కోసం పోరాటం చేస్తున్నా, ప్రభుత్వం నుంచి కానీ, అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేక పోవడం గమనార్హం.

**40ఏళ్ల తర్వాత మళ్లీ తెరమీదికి..**

కనీసం సెంటూ స్థలం లేని నిరుపేదలు చెన్నూర్ పట్టణంలో వేలాది మంది ఉన్నారు. 1984లో ప్రభుత్వం గెర్రెకాలనీలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. ఆనాటి నుంచి ప్రభుత్వం ఎలాంటి భూ పంపిణీ చేపట్టలేదు. ఇంటి స్థలాలు లేక పేదలు అద్దె ఇళ్లలో కాలం వెళ్లదీస్తున్నారు. 40ఏళ్ల తర్వాత ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ ముందుకు వచ్చింది.

### అసైన్డ్ చట్టం ఏం చెబుతుంది

ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు సాగు చేసుకొని జీవనం సాగించేందుకు ప్రభుత్వ భూములను అసైన్డ్ చేసి ఇస్తుంది. ఆ భూమిని సాగు చేసుకొని జీవనం సాగించాల్సి ఉంటుంది. ఏడాది వరకు ఆ యజమాని భూమిని సాగు చేయకుండా ఉంటే, ఆ భూమిని ప్రభుత్వం తిరిగి తీసుకునే హక్కు ఉంటుంది. తిరిగి తీసుకున్న భూమిని జిల్లా కలెక్టర్ నేతృత్వంలో మరో నిరుపేదలకు అసైన్డ్ చేయాల్సి ఉంటుంది. చెన్నూర్‌లో ప్రభుత్వం ఇచ్చిన భూములు సాగు చేయకుండా ఏళ్లకు ఏళ్లు బీడుగా ఉన్నా, అధికారులు పట్టించుకున్న పాపనపోలేదు. దీంతో వందలాది ఎకరాల అసైన్డ్ భూములు చేతులు మారాయి.

### పంపిణీ చేసేంత వరకు పోరాటం ఆగదు



చెన్నూర్ ప్రాంతంలో 200ఎకరాలకు పైగా ప్రభుత్వ అసైన్డ్ భూములు కబ్జాదారుల చేతుల్లోకి మారాయి. అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉంది. అన్యాక్రాంతం అయిన అసైన్డ్ భూములను ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకోవాలి. సర్వే నెంబర్ 8లో గల 27ఎకరాల అసైన్డ్ భూమిని ఇళ్ల స్థలాల కోసం పేదలకు పంపిణీ చేయాలి. భూ పంపిణీ చేసేంత వరకు పోరాటం సాగిస్తాం.

– సంకె రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి

### రియల్టర్ల చేతుల్లోకి..

మండలంలోని బావురావుపేట శివారులోని 8సర్వే నెంబర్‌లో గల 27ఎకరాల భూములను 1971–72లో ప్రభుత్వం ఎస్టీలకు 1/70 చట్టం కింద అసైన్డ్ భూములను పంపిణీ చేసింది. ఆ భూములను ఎస్టీలు కొన్నేళ్లు సాగు చేసి వదిలిపెట్టారు. చెన్నూర్ మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బావురావుపేట భూములకు డిమాండ్ పెరిగింది. దీంతో ఆ భూములపై కన్నేసిన రియల్ వ్యాపారులు గిరిజనుల వద్ద నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేశారు. వెంచర్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. 1/70 చట్టం ప్రకారం గిరిజనులకు పంపిణీ చేసిన భూములు అమ్మరాదు, కొనుగోలు చేయడం నేరం. ఇంకొకరి పేరు మీద పట్టా చేయడం నిబంధనలకు విరుద్ధమే. అలాంటి భూములను సైతం అధికారులు, అధికార పార్టీ నేతల అండదండలతో రియల్ వ్యాపారులు కొనుగోలు చేసి సొమ్ము చేసుకోవడం చెన్నూర్ మున్సిపాలిటీతో పాటు మండలంలో కొనసాగుతుంది.

## ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



ధర్నా చేస్తున్న పార్టీ నాయకులు

**పాతమంచిర్యాల:** భారత రాజ్యాంగ పుస్తకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పౌరుడికి ఉచితంగా అందించాలని ధర్మసమాజ్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని వినతిపత్రాలు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భారత రాజ్యాంగ పుస్తకాన్ని ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు నందిపాటి రాజు, జంగంపల్లి రామస్వామి, రేగుంట రాకేష్, తాళ్లపల్లి చంద్రశేఖర్, గొడిశెల సురేందర్, ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు సిబ్బందికి సన్మానం

**వేమనపల్లి:** మండలంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా ఎంపీపీ స్వర్ణలత ఆధ్వర్యంలో ముగింపు రోజున వైద్య సిబ్బందిని సోమవారం సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, వైద్యుడు రాజేష్, కంటి వెలుగు వైద్యాధికారి వారీష్, వైస్ ఎంపీపీ గణపతి, సిబ్బంది చైతన్యప్రసాద్, జావెద్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితుడికి ఎన్ఆర్ఐ ఆర్థికసాయం

**బెల్లంపల్లి:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తికి ఎన్ఆర్ఐ మానవతా దృక్పథంతో ఆర్థిక సాయం చేశాడు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి బూడిదగడ్డ బస్తీకి చెందిన అన్నారపు సాయికుమార్ అనే వ్యక్తి రజక వృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 8న బెల్లంపల్లి నుంచి భీమిని వెళ్తుండగా మార్గమధ్యలో ఓ వ్యక్తి ఢీ కొట్టడంతో సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు నిరుపేదకావడంతో అదే బస్తీకి చెందిన ఎన్ఆర్ఐ తోడే వెంకట కృష్ణారెడ్డి వెంటనే స్పందించి సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం తన మిత్రులు, బస్తీవాసులైన ఎలుక ఆకాష్, పీక లక్ష్మణ్ రఘుల ద్వారా అందజేశారు. కష్టకాలంలో ఆర్థికసాయం అందించిన వెంకటకృష్ణారెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నారాయణ



**చెన్నూర్:** పట్టణానికి చెందిన ఈర్ల నారాయణను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చెన్నూర్ పట్టణ అధ్యక్షుడిగా నియమించినట్లు ఎస్సీ సెల్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేశ్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల సురేఖప్రేమ్‌సాగర్‌రావు ఆదేశాల మేరకు నారాయణను నియమించినట్లు తెలిపారు.

# సీఎం కప్ పోటీలు షురూ



రాంపూర్‌లో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ



కన్నెపల్లిలో పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ



చెన్నూర్‌లో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

**భీమిని:** కన్నెపల్లి మండల కేంద్రంలో సోమవారం సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. మండలంలోని 15గ్రామపంచాయతీలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆటలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ రాకేష్‌శర్మ, తహసీల్దార్ రాంచందర్, ఎంపీడీఓ రాధాకిషన్, సర్పంచ్ పుల్లూరి సురేఖ, ఎస్సై నరేష్, ప్రధానోపాధ్యాయుడు సంజీవ్, ఆర్ఐ కిషన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**వేమనపల్లి:** మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్ వద్ద సీఎం కప్ ఆటల పోటీలను ఎంపీపీ స్వర్ణలత ప్రారంభించారు. మొదటి రోజు కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, ఎస్సై సుబ్బారావు, ఎంఈఓ తిరుపతిరెడ్డి, ఏపీఎం ఉమారాణి, వైస్ ఎంపీపీ గణపతి, ఎంపీటీసీ బాపు, సర్పంచ్‌లు మధుకర్, బాపు, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, పీఈటీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** హాజీపూర్ మండలంలోని రాంపూర్ ఆవాస విద్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా పోటీలను ఎంపీపీ మందపల్లి స్వర్ణలత ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పూస్కూరి శిల్ప, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, రైతుబంధు మండల కన్వీనర్ పూస్కూరి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ జాడి వెంకటేశ్, ఎంపీడీఓ అబ్దుల్‌హై, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ పోచయ్య, నాయకులు బేర పోచయ్య, అలిశెట్టి కోటి, జూపాక ధర్మయ్య, సోగాల కిష్టయ్య, స్థానికులు పాల్గొన్నారు.

**క్రీడలతో మానసికోల్లాసం**

**చెన్నూర్:** క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ మంత్రి బాపు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో సోమవారం మండల స్థాయి సీఎం కప్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోతె తిరుపతి, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చల్లా రాంరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, తహశీల్దార్ శ్రీనివాస్‌దేశ్‌పాండే, ఎస్సై చంద్రశేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఫణికుమార్, కారెంగుల రామయ్య, మనోహర్ పాల్గొన్నారు.

**దండేపల్లి:** గ్రామీణా క్రీడాకారులను ప్రోత్సహించేందుకే చీఫ్ మినిస్టర్ కప్(సీఎంసీ) 2023 క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. దండేపల్లి మండలం ద్వారకలో సోమవారం నిర్వహించిన మండల స్థాయి సీఎంసీ పోటీలను తహసీల్దార్ హన్మంతరావు, ఎంపీడీవో మల్లేశం, ఎంఈవో రవీందర్, ఎస్సై ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ గీత, రెబ్బనపల్లి సర్పంచ్ కల్యాణి, ఉపసర్పంచ్ ప్రతాప్, ఎంపీటీసీ రాజన్న, ఎంపీవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**పలు మండలాల్లో నేటి నుంచి పోటీలు**

**శ్రీరాంపూర్:** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నస్పూర్ మున్సిపల్ కమిషనర్ టీ.రమేశ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఈ పోటీలు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు మైదానంలో మధ్యాహ్నం 3గంటలకు పీఈటీ మారయ్య సెల్: 9849646224ను సంప్రదించాల్సిందిగా తెలిపారు.

**సీఎం కప్ పోటీలకు ఏర్పాట్లు**

**తాండూర్:** మండలంలో నేటి నుంచి జరిగే సీఎం కప్ ఆటల పోటీల నిర్వహణ ఏర్పాట్లను సోమవారం అధికారులు పరిశీలించారు. తాండూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం క్రీడాపోటీలు నిర్వహించేందుకు అనువైందని గుర్తించారు. ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంఈవో ప్రభాకర్, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తఫాస్ పాల్గొన్నారు.

**మందమర్రిరూరల్:** పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మంగళ, బుధవారం రెండు రోజులు చీఫ్ మినిస్టర్ కప్–2023 మండల స్థాయి ఆటల పోటీలు క్రీడా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికళ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పోటీలు ప్రాంభమవుతాయని వాలీబాల్, కబడ్డీ, ఫుట్‌బాల్, రన్నింగ్, క్రీడల్లో పోటీలు ఉంటాయని క్రీడాకారులు సకాలంలో మైదానం చేరుకుని సహకరించాలని పేర్కొన్నారు.

## దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దు

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**బెల్లంపల్లిరూరల్:** రైతులు వరిధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని చంద్రవెల్లిలో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చిన్నయ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని రైతులకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ అశోక్ గౌడ్, ఏడీఏ సురేఖ, ఏవో వందన, ఏఈవో నాగదీప్తి, ఐకేపీ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కల్యాణలక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం**

**నెన్నెల:** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు వరంగా మారాయని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. నెన్నెల హైస్కూల్లో 36మంది లబ్ధిదారులకు సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, ఆర్డీఓ శ్యామలదేవి, తహసీల్దార్ భూమేశ్వర్, ఎంపీడీఓ వరలక్ష్మి, ఎంపీఓ శ్రీనివాస్, ఆర్ఐ గణేష్ పాల్గొన్నారు.

## ప్రజావాణికి అధికారుల డుమ్మా..!



భీమారం: పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్



వేమనపల్లిలో..

**వేమనపల్లి:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ బాపురావు, ఏపీఓ సత్యప్రసాద్, ఐకేపీ ఏపీఓ ఉమారాణి మాత్రమే హాజరయ్యారు. మండల స్థాయి అధికారులు ఎవరూ హాజరుకాలేదు. కార్యాలయ సిబ్బందిని కూర్చోబెట్టి మమా అనిపించారు. ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

**భీమారం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఎప్పటిలాగే అధికారులు డుమ్మా కొట్టారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఒకరిద్దరు కిందిస్థాయి అధికారులు మాత్రమే హాజరయ్యారు. ప్రతీవారం ప్రజావాణి నిర్వహించాలని మండల స్థాయిలో అధికారులు అందరూ హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశించినా, అధికారులు పెడచెవిన పెడుతున్నారు. ఇప్పటికైనా హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

**దండేపల్లిలో మూడు అర్జీలు**

**దండేపల్లి:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ హన్మంతరావు తెలిపారు. నెల్కివెంకటాపూర్ సమీపంలో పంట పొలంలో గ్రిడ్ పైప్‌లైన్ లీకేజీ, గూడెంలో డిస్ట్రిబ్యూటరీ కాల్వలో చెత్త ఉందని, డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని అర్జీలు వచ్చినట్లు పేర్కొన్నారు.

## పట్టణ సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

**మంచిర్యాలటౌన్:** మున్సిపాలిటీ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని జంక్షన్లను నాసిరకంగా నిర్మిస్తున్నారని, వాటి లోపల వేస్తున్న నాసిరకం మట్టితో నిధులు దోచేస్తున్నారని, రోడ్లను వెడల్పు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. టూటౌన్‌లో హమాలివాడ, తిలక్‌నగర్ వరకు 60ఫీట్ల రోడ్డు వెడల్పుకు బదులుగా బీఆర్‌ఎస్ నాయకుడికి అనుకూలంగా 55ఫీట్లకు కుదించారని, దీనిపై విచారణ చేపట్టాలని కోరారు. బీఆర్‌ఎస్ నేతలు నెలల తరబడి వారి ఫ్లెక్సీలను రోడ్లపై పెట్టి వాహనదారులకు ఇబ్బంది చేస్తున్నా, వాటిని టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించడం లేదన్నారు. గాంధీపార్కుకు తాళం వేయడం సరికాదని, నిరుద్యోగులకు తాము భోజనాలు, అల్పాహారం పెడుతున్నామనే అక్కసుతో తాళాలు వేసి నిరుద్యోగులను ఇబ్బంది పెట్టొద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ రావుల ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ మజీద్, కౌన్సిలర్ రామగిరి బానేశ్, మాజీ కౌన్సిలర్ పూదరి ప్రభాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేశ్, పట్టణ ఉపాధ్యక్షుడు జోగుల సదానందం పాల్గొన్నారు.

## సాగునీరు కాదు.. భగీరథ నీళ్లు!



**దండేపల్లి:** పంట పొలంలో కనిపిస్తున్న నీటిని చూసి సాగునీరనుకుంటే పొరబడినట్టే. ఎందుకంటే, పొలం పక్క నుంచి వెళ్లిన మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన గ్రిడ్‌పైప్‌లైన్ గత నెలరోజుల క్రితం నుంచి లీకవుతూ, నీరంతా పంట పొలంలో చేరుతోంది. ఈ విషయాన్ని గ్రిడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన లీకేజీని సరిచేయడం లేదని, నెల్కివెంకటాపూర్ సమీపంలోని పొలం యజమాని శ్రీనివాస్ తెలిపాడు. దీనిపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతు చేయాలని కోరాడు.

### కత్తెర్ల రోడ్డు నిర్మాణానికి సర్వే



**తాండూర్:** మండలంలోని కత్తెర్ల గ్రామానికి రోడ్డు నిర్మాణానికి సోమవారం సర్వే నిర్వహించారు. గ్రామంలో సర్వే చేసి కొలతలు తీసుకున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నుంచి కత్తెర్ల గ్రామం వరకు 2కిలో మీటర్ల దూరం రోడ్డు నిర్మించాల్సి ఉండగా, రూ.1.70 కోట్లు నిధులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో నాయకులు రాములు, సత్తయ్య, తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### విధుల్లో చేరిన జేపీఎస్‌లు

**చెన్నూర్‌రూరల్:** తమ ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ ఏప్రిల్ 28వ తేదీన నిరవధిక సమ్మె ప్రారంభించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో టి.శ్రీనివాస్‌కు లేఖను అందించి విధుల్లో చేరారు.